వైభవంగా దసరా సంబురం


దూల్‌పేట్‌లో దసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు

చార్మినార్,అబిడ్స్,మెహిదీపట్నం నియోజకవర్గాల్లోని బస్తీలు, కాలనీలలో దసరా సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా మండపాల్లోని దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి పూజాది కార్యక్రమాలు నిర్వహించడంతో అన్ని ప్రాంతాల్లో ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది.

–చార్మినార్,అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం


గుడిమల్కాపూర్ సాయిబాబ జయదుర్గ ఆలయంలో


హిందూ సేవా సమాజ్ ఆధ్వర్యంలో దుర్గామాతకు పూజలు


బేగంబజార్‌లో..


గోల్కొండ కోటలో రావణ దహనం


దసరా వేడుకల్లో పాల్గొన్న నందకిశోర్ వ్యాస్ బిలాల్


మంగళ్‌హాట్‌లో జరిగిన దసరా సంబరాల్లో ..


గోల్కొండ కోటపై దుర్గాష్టమి పూజలు


రావణ దహనంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర తదితరులు


అమ్మవారి పూజాలో పాల్గొన్న మమతా గుప్తా


మీరాలంమండిలో పూర్ణాహుతి


పూజల్లో పాల్గొన్న జనగామ మధుసూదన్ గౌడ్ కుటుంబ సభ్యులు


రావణ దహనం


సుల్తాన్‌షాహీలో జగదాంబ అమ్మవారి రథం ఊరేగింపు


రావణాసురుడి బొమ్మకు పూజలు చేస్తున్న చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెగారాణి


రావణ దహనంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు గాదేపాగ బాలకృష్ణ, అల్వాల్ శివకుమార్


పూజల్లో పాల్గొన్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య


మీరాలంమండిలో అమ్మవారి పల్లకి సేవ ఊరేగింపు



చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి పల్లకి సేవ సామూహిక ఊరేగింపు

క్లుప్తంగా...

మతసామరస్యానికి మారుపేరు హైదరాబాద్


మాట్లాడుతున్న మాధవిలత

గోల్కొండ: పండుగల సందర్భంగా హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని విరించి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మాధవిలత అన్నారు. సోమవారం రాత్రి గోల్కొండలో హిందూ సేవా సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన దసరా సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశంలో హైదరాబాద్‌కు ఏ నగరం సాటిరాదని హిందూ ముస్లిం సోదరులు కలిసిమెలిసి ఉంటూ పండుగలు జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు వస్తాద్, సర్దార్‌సింగ్, శోభాపాండే, బాలప్రసాద్ తివారి, శ్రీకాంత్‌చారి పాల్గొన్నారు.

కంచన్‌బాగ్ ఠాణాను సందర్శించిన డీసీపీ రోహిత్ రాజ్


డీసీపీ రోహిత్ రాజుకు స్వాగతం పలుకుతున్న ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి.రోహిత్ రాజ్ సందర్శించారు. ఆయనకు కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి ఆయనకు పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఏసీపీ బి.రోహిత్ రాజ్ కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఎన్నికల సమయంలో ఎలాంటి నేరాలకు పాల్పడినా సంహించేది లేదని హెచ్చరించారు. సమాజంలో మంచి వ్యక్తులుగా మెలుగుతూ కుటుంబంతో సంతోషంగా ఉండాలని రౌడీషీటర్లకు సూచించారు.

5న జీవన విద్యపై వర్క్‌షాప్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో 'జీవన విద్య' అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నవంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జీవితాన్ని ఆనందమైన, అర్థవంతమైన ప్రయాణంగా మార్చుకోవడానికి , సంతృప్తికరమైన జీవనంగా మార్చుకునేందుకు అవకాశం కల్పించేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం వాసు 9849285628, శ్రీనివాస్ 9948885111లో సంప్రదించాలని వారు కోరారు.

చందానగర్‌లో రూ.28 లక్షలు సీజ్



హఫీజ్‌పేట్ : చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంగారం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రవికుమార్ అనే వ్యక్తి వాహనంలో 28 లక్షల 9వేల 519 రూపాయలు తరలిస్తుండగా ఎస్‌ఓటీ, చందానగర్ పోలీసులు గుర్తించారు. డబ్బుకు సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం సీజ్ చేసిన డబ్బును ఎన్నికల అధికారులకు అప్పగిస్తామని సీఐ పాలవెల్లి తెలిపారు.

ముమ్మర తనిఖీలు

మాదాపూర్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చందానగర్ శ్రీదేవి థియేటర్, అమీన్‌పూర్ రోడ్డులో ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి, ఎన్నికల అధికారులు, ప్రత్యేక టీంలతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీ చేస్తున్నట్లు మాదాపూర్ డీసీపీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో రెండురోజుల ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సోమవారం ఉదయం షిర్డీ సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలు ఆరంభమయ్యాయి.అనంతరం పంచామృతాభిషేకం, అష్టోత్తరములు, విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం, సాయిగీత మాలిక, మధ్యాహ్నాం హారతి, సాయి చాలీసా వంటి కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి ఆలయంలో భజన బృందంచే ప్రత్యేక భజనలను నిర్వహించారు. మంగళవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

రోబోటిక్ లేజర్ క్యాటరాక్ట్ సర్జరీతో ప్రయోజనాలు

గోల్కొండ: క్యాటరాక్ట్ సర్జరీలో అత్యాధునిక రోబోటిక్ లేజర్ క్యాటరాక్ట్ సర్జరీతో నొప్పి లేకుండానే కంటి శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని మెహిదీపట్నంలోని అక్బర్ ఐ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ కంటి శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ అల్తాఫ్ అక్బర్ అన్నారు. మంగళవారం మెహిదీపట్నంలో అయన రోబోటిక్ లేజర్ క్యాటరాక్ట్ సర్జరీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేవలం అరగంటలోనే ఈ క్యాటరాక్ట్ సర్జరీ పూర్తవుతుందని ఇది బ్లేడ్ ఫ్రీ విధానంలో జరిగే అత్యంత ఆధునికమైన రోబోటిక్ సర్జరీ అన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ క్యాటలిస్ట్ ప్రిసిసన్ లేజర్ సిస్టమ్ ద్వారా ఇది జరుగుతుందని దీనికి తోడు ఆసుపత్రిలో లాసిక్ ట్రీట్‌మెంట్ కూడా ఉందని దీన్ని ద్వారా లేజర్ టెక్నాలజీ ద్వారా కంటి చూపును సరి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫాకో అండ్ లాసిక్ సర్జన్ డాక్టర్ నాజీయా అఫ్రోజ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అల్తాఫ్ అక్బర్

శాంతి సామరస్యానికి నిదర్శనంగా పాతబస్తీలో ఉత్సవాలు

చార్మినార్: శాంతి సామరస్యానికి పాతబస్తీలోని ఉత్సవాలు నిదర్శనంగా కొనసాగుతాయని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం నాగులచింతలోని ఆర్యమైదానంలో జరిగిన దసరా వేడుకల్లో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఇలాంటి సామాజిక సామూహిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘమిత్ర అసోసియేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ప్రముఖ సంఘసేవకుడు, ,గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్ఞత తదితరులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో శంకర్, పెంజర్ల సత్యనారాయణ, అర్జున్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.



శ్యాంరావు ముదిరాజ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్

వ్యక్తి అదృశ్యం


అనిల్‌కుమార్ కత్రి

అబిడ్స్: ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉస్మాన్‌గంజ్ రిసాలా బ్దుల్లాలో నివసించే అనిల్‌కుమార్ కత్రి (30) స్టేషనరి వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 20వ తేదీ రాత్రి తన సెల్‌ఫోన్ మరమ్మతు కోసం అబిడ్స్ జగదీశ్‌మార్కెట్‌కు వెళ్లిన అనిల్‌కుమార్ తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం తండ్రి ఓంప్రకాష్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ.శైలజ పేర్కొన్నారు.

ఏబీవీపీ ఆందోళన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. చెన్నయ్‌లో జాతీయ పతాకానికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి ఆందోళన చేశారు. తమిళనాడు ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకొని, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం'

అబిడ్స్: బీఆర్‌ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. దసరా సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రగతి, అభివృద్ధితోనే బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు ఎంత అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నందుకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, నందుకుమార్

జంగ్ 2023 తెలంగాణ

కార్వాన్‌లో విజయం సాధిస్తా

గోల్కొండ: కార్వాన్‌లో విజయం సాధిస్తానని బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిసి సన్మానించిన అనంతరం మాట్లాడారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అరాచక పాలనకు తెర పడే రోజులు దగ్గరపడ్డాయని రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు.

బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా హరినాథ్ గౌడ్

చార్మినార్: త్వరలో జరగనున్న శాసన సభ ఎన్నికల్లో చాంద్రాయణగుట్ట నియోజక వర్గం నుంచి బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా పాతబస్తీకి చెందిన గౌడ బంధం మ్యారేజ్ బ్యూరో చైర్మన్ గడ్డమీది హరినాథ్ గౌడ్‌ను బరిలో దించుతున్నట్లు బీఎల్‌ఎఫ్ చైర్మన్ సూర్యప్రకాష్ వెల్లడించారు. ఈ మేరకు ఆయనకు ఎంపిక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరినాథ్ గౌడ్ మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో విజయం కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు దండి వెంకట్ తదితరులున్నారు.



హరినాథ్ గౌడ్‌ను అభినందిస్తున్న బీఎల్‌ఎఫ్ చైర్మన్ సూర్యప్రకాష్

చార్మినార్‌లో బీజేపీ విజయం ఖాయం

చార్మినార్: ఈసారి చార్మినార్ శాసన సభ నియోజక వర్గంలో బీజేపీ అభ్యర్థి మెఘారాణి తప్పనిసరిగా విజయం సాధించి పాతబస్తీలో బీజేపీకి పట్టుందని నిరూపిస్తుందని నార్‌నూల్ అగర్వాల్ సమితి హైదరాబాద్, సికింద్రాబాద్, హిందూ సంరక్షణ్ సమితి అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. బుధవారం చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణిని ఘాన్సీబజార్‌లో కలిసిన ప్రతినిధుల బృందం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన శాసన సభ ఎన్నికల్లో బీజేపీ రెండో స్థానంలో నిలిచిందని..ఈసారి ఉన్నత విద్యాభ్యాసం చేసిన మహిళా అభ్యర్థి పోటీలో ఉన్నందున విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాజ్ కమల్ భట్, తరుణ్‌కుమార్ అగర్వాల్, నీరజ్ అగర్వాల్ పాల్గొన్నారు.


మెఘారాణికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

మర్యాదపూర్వక కలయిక

గౌలిపురా: యాకుత్‌పురా నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఎన్.వీరేందర్ బాబు యాదవ్ గౌలిపురాలో దివంగత ఆలే నరేంద్ర నివాసంలో ఆయన సతీమణి, మాజీ కార్పొరేటర్ ఆలే లలితా నరేంద్ర కుటుంబ సభ్యులను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా శుభాకాంక్షలు తెలియజేసి లలితా నరేంద్ర ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి సుమన్ కుమార్ ముదిరాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రాజ్ కుమార్ పాల్గొన్నారు.


ఆలే లలితా నరేంద్ర కుటుంబ సభ్యులను కలిసిన వీరేందర్ బాబు యాదవ్


మాట్లాడుతున్న డీసీపీ రోహిత్ రాజు


కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ బాలస్వామి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జియాగూడ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధుల్లోని రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్దకే వెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సౌత్, వెస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి అన్నారు. మంగళవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌నగర్‌లోని పలువురి రౌడీషీటర్ల నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మహ్మద్ అబ్దుల్ జావేద్, సిబ్బంది పాల్గొన్నారు.

కంచన్‌బాగ్ పరిధిలో..

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదైన హఫీజ్‌బాబానగర్‌కు చెందిన ఇలియాజ్ ఇంటికి మంగళవారం సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బి.రోహిత్ రాజు, చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్ కుమార్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడారు. అర్ధ రాత్రి వేళల్లో అనవసరంగా ఎవరూ రోడ్లపై కూర్చుంటూ గొడవలకు దిగరాదన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

గోల్కొండ: కాలనీల అభివృద్ధికి నిరంతరం తాను కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీలో జరిగిన టోలిచౌకీ కాలనీల సంక్షేమ సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాలనీలలో రోడ్లు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, అవసరమైన చోట వీడీ, సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. కాలనీ సంక్షేమ సంఘం వారు తన దృష్టికి తెచ్చిన సమస్యలను కూడా పరిష్కరించడం జరిగిందన్నారు. టోలిచౌకీ నదీమ్ కాలనీ, బాల్‌రెడ్డినగర్, విరాసత్‌నగర్ తదితర కాలనీలలో బాక్స్ డ్రైనేజీను వేయడంతో ఈ కాలనీలకు వరద ముంపు తప్పిందన్నారు. నదీమ్ కాలనీకి శాశ్వతంగా వరద ముంపు తప్పించేందుకు శాతం చెరువు తూముకు మరమ్మతు చేశామన్నారు. అల్‌హసనత్ కాలనీ, కాకతీయనగర్ కాలనీలలో ఉన్న పార్కులను అభివృద్ధి చేశామని ఎండీ లైన్స్‌లోని ఓవైసీ కమ్యూనిటీహాల్‌ను ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు బదరుద్దీన్, వజీఉజ్జమ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గాజా ప్రజలకు మద్దతుగా మౌన ప్రదర్శన

చార్మినార్: గాజా విల్ నెవర్ డై..స్టాప్ బాంబింగ్ ఆన్ గాజా..లాంగ్ లివ్ పాలస్తీన్..అంటూ కొంత మంది ముస్లింలు మంగళవారం ప్ల కార్డులు పట్టుకొని మౌన ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనా గాజా ప్రజలకు అండగా ఉండాల్సిన సమయం వచ్చిందని..వారికి మానసిక స్థైర్యాన్ని కల్పించడం కోసం తాము చార్మినార్ వద్ద ఈ ప్రదర్శన చేపట్టామని సిటిజన్స్ కన్సర్న్‌డ్ ఆఫ్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. చార్మినార్ వద్ద జరిగిన ఈ నిరసన ప్రదర్శన సమాచారం చార్మినార్ ఏసీపీతో పాటు స్థానిక పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

